సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

భయపెడుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు

జ్ఞానాపురంలోని నిరుపేదలుండే అనేక కాలనీల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా మారాయి. కొన్ని చోట్ల ఇవి తక్కువ ఎత్తులో ఏర్పాటు చేయటం వల్ల పాదచారులు, వాహన చోదకులు, పిల్లలు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే ఫ్యూజ్ బాక్సులకు తలుపులు లేని చోట కూడా పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. లోవోల్టేజీ సమయంలో ఇక్కడి కొన్ని ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి మంటలు చెలరేగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఈ సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

- తక్కువ ఎత్తులో నిర్మించిన చోట ప్రమాదాలకు ఆస్కారం
- పాదచారులు, వాహన చోదకులు, పిల్లలు బాధితులు
- తగిన చర్యలు తీసుకోవాలని పలు కాలనీల ప్రజల అభ్యర్థన


ఎర్రిగెడ్డకి వెళ్లే చోట ఇలా..


సెబాస్టియన్ కాలనీ రహదారిలో ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్

కంచరపాలెం : జ్ఞానాపురంలో అనేక చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఫ్యూజ్ బాక్సులు ప్రమాదకరంగా మారాయి. దీంతో విద్యుత్ తీగలు కిందకి వేలాడుతుండటంతో తరచూ పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు, పిల్లలు ప్రమాదాలకు గురవుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ వేసిన కంచెలను ఎవరో తొలగిస్తున్నారు. కంచె ఉన్నా కొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరే కొందరు మూత్ర విసర్జన చేస్తున్నారు. బాబు కాలనీలో పదిహేనేళ్ల బాలుడు కరెంట్ తీగలు తగిలి ప్రాణాలు విడిచిన సంఘటన.. జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో గతంలో ఓ వ్యక్తికి తీగలు తగిలి ప్రమాదానికి గురైన సంఘటన చోటు చేసుకున్నాయి.

సెబాస్టియన్ కాలనీలో ఇళ్ల ముందున్న ట్రాన్స్‌ఫార్మర్ గట్లపై బట్టలు ఆరేస్తూ పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఇనుప కంచెలు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయపడుతున్నారు. విద్యుత్ సిబ్బంది వీటి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు వాపోతున్నారు. చాలా ప్రాంతాల్లో పాదచారులు వెళ్లే మార్గాల్లో ప్రమాదభరితంగా ఇవి ఉండటంతో అటుగా వెళ్లేటప్పుడు భయాందోళనకు గురవుతున్నారు. స్మార్ట్ సిటీలో ట్రాన్స్‌ఫార్మర్లకు శాశ్వత పరిష్కారం చేపడతామని, విద్యుత్ వ్యవస్థను అండర్ గ్రౌండ్‌కు మార్పు చేస్తామని చెప్పిన అధికారులు మురికివాడల్లో ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఈ సమస్యపై సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఇనుప కంచెలు వేయాలని పలువురు కోరుతున్నారు.


మాన్యువల్ స్ట్రీట్ రహదారిలో..


జ్యోతి నిలయానికి వెళ్లే రహదారిలో ఇలా..

నిర్లక్ష్యం తగదు..



జ్ఞానాపురంలో పేదలు నివసించే పలు కాలనీల్లో అధికారులు నిర్లక్ష్యంతో తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు నిర్మిస్తున్నారు. వాటికి కంచె కూడా వేయడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు పెంచాలని కోరినా ఎవరూ పట్టించుకోవటం లేదు. ప్రమాదాలు జరుగుతున్నా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా విద్యుత్ ఫ్యూజ్ బాక్సులకు తలుపులు ఏర్పాటు చేయాలి.

– బూర మణికిరణ్, బాబుకాలనీ, జ్ఞానాపురం.

ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు పెంచాలి



సెబాస్టియన్‌కాలనీ, బాబుకాలనీ, గెడ్డవీధి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు పెంచి వాటికి వెంటనే రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలి. ఆర్‌సీఎం పాఠశాల పక్కన ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ముందుకు రావాలి. లోవోల్టేజీ సమస్య టైంలో ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి మంటలొస్తున్నాయి. ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నాం.

– మీనాల స్వర్ణలత, స్లీప్‌గుర్తువీధి, జ్ఞానాపురం.

నూతన న్యాయ చట్టాలపై అవగాహన అవసరం


నూతన న్యాయ చట్టాలపై సచివాలయ పోలీసులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకటరావు

సీతమ్మధార : నూతన న్యాయ చట్టాలపై సచివాలయం పోలీసులకు అవగాహన అవసరమని ఫోర్తు టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ వెంకటరావు సూచించారు. చట్టాలపై మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. జూలై 1 నుంచి మారిన సెక్షన్లు, బాధితుల హక్కుల పరిరక్షణకు తీసుకొచ్చిన కొత్త చట్టాలపై వివరించారు. మీ పరిధిలో ఎటువంటి నేరాలు జరిగినా వెంటనే పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని, ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే తక్షణమే సమాచారం అందించాలని కోరారు. సచివాలయ పరిధిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే ట్రాఫిక్ రూల్స్ పాటించని వారికి అవగహన కల్పించాలని సూచించారు. హెల్మెట్ ధరించని వారు, వాహనాలకు సంబంధించిన పత్రాలు లేనివారు, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 35 సచివాలయాల పోలీసులు పాల్గొన్నారు.

జీవీఎంసీ దుకాణాలకు 9న వేలం

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ జోన్–8 పరిధి పెందుర్తి వాణిజ్య సముదాయంలో 2 దుకాణాలకు బహిరంగ వేలం వేయనున్నట్టు జోనల్ కమిషనర్ హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. వాణిజ్య సముదాయంలో గల ఆయా దుకాణాలను మూడేళ్ల కాల పరిమితికి వేలం ద్వారా ఇచ్చేందుకు ఈ నెల 9 ఉదయం 11 గంటలకు జోన్–8 కార్యాలయంలో నిర్వహించనున్న బహిరంగ వేలంలో ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాలకు జోనల్ కార్యాలయ పని వేళల్లో పర్యవేక్షకులను సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

క్లుప్తంగా

మున్సిపల్ కార్యాలయం పనుల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో చేపట్టిన మున్సిపల్ కార్యాలయం భవన నిర్మాణ పనులను మంగళవారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ సమీప ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న పంప్‌హౌస్ ప్రాంగణంలో నిర్మిస్తున్న జీవీఎంసీ మున్సిపల్ ఆఫీస్ పనులెలా జరుగుతున్నాయో చూసి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. ఏఈ రత్నాకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కరిమిరెడ్డి శ్యామ్ పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న రైల్వే జనరల్ మేనేజర్


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం రైల్వే జనరల్ మేనేజర్(భువనేశ్వర్) పరమేశ్వర్ ఫన్కాల్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు అష్టోత్తరపూజ నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు. జీఎం వెంట వాల్తేరు డివిజన్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మురళీనగర్: జోన్–2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ పరిధి ఎన్ఎస్‌టీఎల్ 33కేవీ కామన్ పాయింట్, ఎన్ఎస్‌టీఎల్–2 33 కేవీ సింహాచలం ఫీడర్లలో నిర్వహణ పనుల కారణంగా పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటన లో తెలిపారు. సాయినగర్, పార్వతీనగర్, హుస్సేన్‌నగర్, నరేంద్రనగర్, ఆర్‌అండ్‌బీ కూడలి, గ్రీన్ గార్డెన్స్, అంబేడ్కర్‌నగర్ కాలనీ, జాకీర్ హుస్సేన్‌నగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ


మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యవరణాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించిన 'అమ్మ పేరుతో ఒక మొక్క' కార్యక్రమం బాలయ్య శాస్త్రి లే అవుట్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద మంగళవారం ప్రారంభించారు. ముందుగా విష్ణుకుమార్ రాజు మొక్క నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మొక్కలు నాటే ప్రతి ఒక్కరూ వాటిని సంరక్షించాలని కోరారు. ప్రతి ఒక్కరూ వారి ఇంటి వద్ద మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సురేష్‌బాబు, శంకరరావు, అప్పన్న, వరప్రసాద్, వీరబాబు, నాగరాజు, రాకేష్ పాల్గొన్నారు.

ప్రజా రక్షణే అగ్నిమాపక శాఖ ధ్యేయం


రక్షణ పరికరాలను అందిస్తున్న హిందుస్తాన్ కోలోస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి

మురళీనగర్: ప్రజల ప్రాణాల రక్షణ ధ్యేయంగా అగ్నిమాపక శాఖ పని చేస్తుందని ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఆర్.నిరంజన్‌రెడ్డి అన్నారు. బర్మా క్యాంపు కాలనీలోని మర్రిపాలెం అగ్నిమాపక కేంద్రంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రక్షణ సమయంలో సిబ్బంది స్వీయ రక్షణ కూడా అంతే ముఖ్యమని చెప్పారు. ప్రజలను విపత్తుల నుంచి రక్షించడంలో సిబ్బంది సేవలు విలువైనవని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది రక్షణ కోసం హిందుస్థాన్ కోలోస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ రూ.7లక్షలు విలువ చేసే రక్షణ సామగ్రిని అందించింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు కౌశిక్, ప్రతాప్, ఏవీఎస్ రావులను అగ్నిమాపక కేంద్రం తరఫున సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి రేణుకయ్య, మర్రిపాలెం, సూర్యాబాగ్, పెదగంట్యాడ, చిట్టివలస అగ్నిమాపక అధికారులు కేవీటీ ప్రసాదరావు, పి.సింహాచలం, ఎం.గోపీకృష్ణ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి వారాహి నవరాత్రులు


శ్రీలలితా పీఠంలో కొలువైన వారాహి అమ్మవారు

సీతంపేట: శ్రీలలితా పీఠాధిపతి, కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో ఈ నెల 6 నుంచి 15వ తేదీ వరకు వారాహి నవరాత్రులు నిర్వహించనున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం 6.30 గంటలకు సహస్రనామ అర్చన, అనంతరం వారాహి హోమం చేస్తామన్నారు. వారాహి దేవిని పూజించడం వల్ల కష్టాల నుంచి ఉపశమనం, భూసంబంధిత వ్యవహారాల పరిష్కారం, శత్రునాశనం, పంటలు పరిరక్షణ, ప్రయోగ బాధల నుంచి విముక్తి, ఆరోగ్యం, మానసిక సమస్యల నుంచి విముక్తి కలుగుతుందన్నారు. నవరాత్రి పూజా కార్యక్రమాల్లో పాల్గొనదలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కమనీయం.. వెంకన్న కల్యాణం


ఆకట్టుకున్న అంబరిల్లా డ్యాన్స్


వెంకటేశ్వరస్వామి పల్లకి ఊరేగింపు

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు వెంకటేశ్వర కాలనీలో కొలువైన వేంకటేశ్వరస్వామి 18వ వార్షిక కల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి స్వామి వారికి పంచామృతాభిషేకం, అర్చన, ప్రత్యేక హారతులు, దూపదీప నైవేద్యాలతో పూజలు చేశారు. అనంతరం పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ స్వామి వారి కల్యాణ మహోత్సవం కమనీయంగా సాగింది. ప్రత్యేక అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర ప్రాంత భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

వైభవంగా తిరువీధి

కల్యాణ మహోత్సవంలో భాగంగా వెంకటేశ్వర స్వామి, పద్మావతిల తిరువీధి మహోత్సవం వైభవంగా జరిగింది. మేళతాళాలు, సంప్రదాయ, సాంస్కృతిక ప్రదర్శనలతో ఊరేగింపు కనుల పండుగగా సాగింది. వెంకటేశ్వర కాలనీ, నందగిరి నగర్, శ్రీనివాసనగర్ ప్రాంతాలలో స్వామి వారిని


అలివేలు, పద్మావతి సమేత వెంకన్నస్వామి వేషధారణ

పల్లకిలో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు కొబ్బరికాయలు కొట్టి, హారతులు ఇచ్చి నీరాజనాలు పలికారు. ఊరేగింపులో ఏర్పాటు చేసిన కోలాటం, తప్పెటగుళ్లు, గొడుగుల డ్యాన్స్, కేరళ బ్యాండు, కోయ డ్యాన్స్, వెంకటేశ్వస్వామి వేషధారణ విశేషంగా ఆకట్టుకున్నాయి.

మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర పోటీలకు ఆహ్వానం


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న న్యూహోప్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మంచా నాగమల్లేశ్వరి

సీతంపేట: రైతులు, చేనేత కళాకారులకు చేయూత నివ్వాలన్న సంకల్పంతో న్యూహోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర–2024 పోటీలు త్వరలో నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు మంచా నాగమల్లేశ్వరి తెలిపారు. ఈ మేరకు ప్రచార పోస్టర్లను మంగళవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ జరిగే ఈ పోటీల్లో పాల్గొనదలచిన ఉత్తరాంధ్ర జిల్లాల మహిళలు 73370 97256 ఫోన్ నంబరులో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మిస్ ఉత్తరాంధ్ర విన్నర్ శ్రేయ, మిస్ విజయనగరం భాగ్య, ఉత్తరాంధ్ర విన్నర్ లక్ష్మి, న్యూహోప్ డైరెక్టర్ సిద్ధు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్ నాశనం

ఏసీపీ నరసింహమూర్తి


మాట్లాడుతున్న ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి

పెందుర్తి: యువత అనుకున్న లక్ష్యం చేరుకోవాలంటే కచ్చితంగా చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి అన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితాలు పాడు చేసుకుని తల్లిదండ్రులకు క్షోభ మిగిల్చినవారవుతారన్నారు. చినముషిడివాడలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం డ్రగ్స్ వినియోగం–దుష్పలితాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. అలాగే ఆన్‌లైన్ బెట్టింగ్‌ల్లో ఎంతో మంది నగదు కోల్పోయి ప్రాణాలు తీసుకునే పరిస్థితి వచ్చిందని చెప్పారు. యువత కష్టపడి పైకి రావాలే తప్పా అడ్డదారుల్లో ముందుకు వెళ్లాలనుకోవడం మంచి పరిణామం కాదన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. సీఐ రామకృష్ణ, పాల్గొన్నారు.

గీతా పఠనంతో ఆధ్యాత్మిక వైభవం


ప్రత్యేక పూజలు చేస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్ : లోక కల్యాణార్థం విశ్వ శాంతిని కాంక్షిస్తూ వన్‌టౌన్ రాజప్పనాయుడు వీధిలో గల గీతా భవన్‌లో మహిళలచే సామూహిక సంపూర్ణ గీతా పారాయణ, విష్ణు సహస్రనామాలు, హనుమాన్ చాలిసా పారాయణ సాంప్రదాయ రీతిన నిర్వహించారు. గీతా ప్రచార సమితి, భారత్ వికాస్ పరిషత్, ఝాన్సీ లక్ష్మీభాయి మహిళా శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఏకాదశి పర్వదినం సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమాన్ని గీతా ప్రచార సమితి అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీతను పఠించడం వల్ల ఆధ్యాత్మిక చైతన్యంతో కూడిన మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. భారత్ వికాస్ పరిషత్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. గత 25 ఏళ్లకు పైగా ఆధ్యాత్మిక వైభవానికి నిస్వార్థ సేవలందిస్తున్న చావలి విశ్వేశ్వరరావును భారత్ వికాస్ తరఫున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ రాష్ట్రస్థాయి ప్రతినిధి ఎంవీ రాజశేఖర్, విశాఖ శాఖ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, జీఎస్‌వీ మాణిక్యాలరావు, పి. షర్మిల, వనజ, శారద, మంజుల, జీవీఆర్ ప్రసాద్, లక్ష్మీ నరసింహ, భక్తులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

అల్లిపురం : గుడికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటికి వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి రాలేదని ఆమె సోదరి జగదీ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జూన్ 28వ తేదీ ఉదయం 11.30 గంటల సమయంలో ఎదురింటి ఆంటీతో గుడికి వెళ్లి వస్తానని వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. దీంతో వారు నగరంలో పలు ప్రాంతాల్లో వెదికినా ఆచూకీ తెలియకపోవటంతో టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఉక్కు' రక్షణకు ఒత్తిడి తేవాలి

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణకు ఆ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. విశాఖలో నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాల్లో పాల్గొనడానికి వచ్చిన నారాయణను కలిసి, ఇక్కడి పరిస్థితిని వివరించారు. ఇక్కడి స్టీల్‌ప్లాంట్ ఎందరో ప్రాణ త్యాగాలతో ఆవిర్భవించిందని, అలాంటి పరిశ్రమను ప్రైవేటీకరించేందుకు పూనుకోవడం సరికాదని వారు పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తే వేలాదిమంది రోడ్డున పడతారని తెలిపారు. వినతి పత్రం సమర్పించిన వారిలో నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎల్లేటి శ్రీనివాసరావు, తాండ్ర కనకరాజు, జి.ఆనంద్, కె.రాజబాబు తదితరులున్నారు.

ఉక్కు భూసేకరణ కార్యాలయంలో నోటీసు బోర్డు వివాదం



భూసేకరణ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నోటీసు బోర్డు

గాజువాక: విశాఖ ఉక్కు భూసేకరణ కార్యాలయంలో అధికారులు ఏర్పాటు చేసిన నోటీసు బోర్డుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భూసేకరణ కార్యాలయానికి ఏదైనా పని నిమిత్తం వచ్చే వ్యక్తులు స్వయంగా గాని, వారి రక్త సంబంధీకులు గాని అయి ఉండాలని, మధ్యవర్తులకు, దళారులకు ప్రవేశం నిషిద్ధమని ఆ బోర్డులో పేర్కొన్నారు. వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని అందులో హెచ్చరించారు. దీనిపై నిర్వాసిత కాలనీలకు చెందిన పలువురు నాయకులు, సమాచార హక్కు కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలపై అధికారులను కలవడానికి వెళ్తామని, అయినంతమాత్రాన నాయకులను, సమాచార హక్కు కార్యకర్తలను దళారులుగా భావిస్తారా అని వ్యాఖ్యానిస్తున్నారు. భూసేకరణ కార్యాలయంలో కొంతమంది వ్యక్తులు అనధికారికంగా పనిచేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని, వారి వివరాలపై ఆరా తీస్తున్నందుకు సిబ్బంది ఈ విధంగా బోర్డును ఏర్పాటు చేశారని అంటున్నారు. అదే కార్యాలయంలో పనిచేస్తున్న ఒక ఉద్యోగిపై స్థల ఆక్రమణ ఆరోపణ వచ్చిందని, దీనిపై ప్రశ్నిస్తుండటంవల్లే ఇలాంటి చర్యలకు కార్యాలయ అధికారులు ఉపక్రమించారని ఆరోపిస్తున్నారు.

నేత్ర పర్వం.. అప్పన్న నిత్య కల్యాణం


మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం అనంతరం సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
8309817091

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com